క్లుప్తంగా

వేతనాలు చెల్లించాలని వినతి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

మాడ్గుల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు జగన్ అన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గురువారం మండల అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నర్సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు సయ్యద్ నబీ, యాదయ్య, కృష్ణ, నిరంజన్, సర్దార్, లలాయ్య, దశరథం, ఈదమయ్య, వెంకటయ్య, సువర్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు ఏర్పాట్లు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అమరేందర్ రెడ్డి

తుర్కయంజాల్: బోనాల పండుగను పురస్కరించుకుని దేవాలయాల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి.. సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో వార్డు అధికారులు, జవాన్లు, ఎలక్ట్రీషియన్లతో సమీక్ష నిర్వహించారు. బోనాల సంబురం సందర్భంగా ఆలయాల వద్ద పారిశుద్ధ్య పనులు విస్తృతం చేయాలని చెప్పారు. పరిసర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలిగేలా చూడాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ భిక్షపతి, ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఓ శ్రీనివాసులు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక రుసుం తీసుకుంటే చర్యలు

తహసీల్దార్ షేక్ ముంతాజ్



డాక్యుమెంటేషన్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కడ్తాల్: రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లకు.. ప్రభుత్వం నిర్దేశించిన రుసుం కంటే అధికంగా తీసుకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ షేక్ ముంతాజ్ హెచ్చరించారు. గురువారం ఆమె తహసీల్ కార్యాలయ పరిసరాల్లోని డాక్యుమెంటేషన్, జిరాక్స్, మీసేవ కేంద్రాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. అప్లికేషన్లకు చెల్లిస్తున్న ఫీజు వివరాలను దరఖాస్తుదారులను అడిగి తెలుసుకున్నారు. అధికంగా రుసుం తీసుకుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తే.. కఠిన చర్యలు తప్పవని డాక్యుమెంటేషన్ నిర్వాహకులను తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పాషాను పరామర్శిస్తున్న పద్మ, సంధ్య

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ పీఆర్ఓ పాషా సతీమణి షాహిన్ ఇటీవల మృతిచెందారు. ఈ మేరకు గురువారం పాషా కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేనకోడళ్లు గోలి పద్మ, ఎన్నం సంధ్య పరామర్శించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని రామోజీ ఫిల్మ్‌సిటీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి అనాజ్‌పూర్ 33/11కెవి విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని ఏఈ నరేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు అనాజ్‌పూర్, గుంతపల్లి, మజీద్‌పూర్ గ్రామాలు, పలు పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అడుగడుగునా గుంతలే..

- అధ్వానంగా నాదర్‌గుల్ రోడ్డు
- మరమ్మతుకు నోచుకోని వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



ఆదిబట్ల నాదర్‌గుల్ రోడ్డు దుస్థితి

ఇబ్రహీంపట్నం రూరల్: వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలో నాసిరకం రోడ్లు. చుట్టూ ఎంతో అభివృద్ధి కనిపిస్తున్నప్పటికీ ఆదిబట్ల– నాదర్‌గుల్ రోడ్డు మాత్రం అధ్వానంగా తయారైంది. నిరంతరం భారీ వాహనాలు పరుగులు తీస్తుండటంతో రహదారి పూర్తిగా ధ్వంసమైంది. అడుగడుగునా గోతులు ఏర్పడి రూపం కోల్పోయింది. ఈ మార్గంలో పయనించాలంటే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రయాణం నకరంగా ఉందని వాపోతున్నారు. నాడు దూరం తగ్గడం కోసం ఏర్పాటు చేసిన ఈ రోడ్డు పాడై.. మళ్లీ దూరాన్ని పెంచిందని, పది నిమిషాల ప్రయాణం కాస్త.. గంటలు పడుతుందని పేర్కొంటున్నారు.

రియల్ భూమ్

ఆదిబట్ల నుంచి నాదర్‌గుల్ వెళ్లడానికి దూరం తగ్గడం కోసం 2014లో ఆదిబట్ల ఠాణా ఎదుట నుంచి నాదర్‌గుల్ వరకు ఆరు కిలో మీటర్ల దూరం జిల్లా పరిషత్తు నిధులతో రోడ్డు వేశారు. రహదారి నిర్మాణంతో ఈ ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయి. రోడ్డుకు ఇరువైపులా భారీగా భవనాలు వెలిశాయి. అనేక దుకాణ సముదాయాలు ఏర్పాటు చేశారు. పరిశ్రమలు కొలువుదీరాయి. భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. నాడు రూ.2 కోట్లు పలికే ఎకరా భూమి.. ప్రస్తుతం రూ.10 కోట్లకు ఎగబాకింది.

శిథిలరోడ్డు

నాదర్‌గుల్, ఆదిబట్ల మార్గంలో రహదారి నిర్మాణంతో అనేక పరిశ్రమలు కొలువుదీరాయి. రెడిమిక్స్ కంపెనీలు భారీగా ఏర్పాటు చేశారు. నిత్యం భారీ వాహనాలు పరుగులు తీస్తుండటంతో రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. ఆదిబట్ల ఠాణా నుంచి నాదర్‌గుల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వరకు రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో చిన్నవాహనదారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు నిర్మాణం నాటి నుంచి అప్పుడప్పుడు మరమ్మతులు చేపడితే ఇప్పుడు ఈ దుస్థితి వచ్చేది కాదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ వాహనాలతోనే..



నాదర్‌గుల్, ఆదిబట్ల మార్గం గుండా నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రెడిమిక్స్ కంపెనీల లారీలు సామర్థ్యానికి మించి లోడ్‌ను తరలిస్తుండటంతోనే రోడ్డు అధ్వానంగా మారింది. ఇదే విషయాన్ని ఆర్టీఏ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. వెంటనే రోడ్డుకు మరమ్మతు చేయించాలి.

– యాదగిరి, నాదర్‌గుల్

సమస్య పరిష్కారానికి కృషి



ఆదిబట్ల– నాదర్‌గుల్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ప్రస్తుతం ఈ మార్గం మున్సిపాలిటీలోనే ఉంది. కానీ జిల్లా పరిషత్ రోడ్డు కావడంతో సాంకేతిక సమస్య తలెత్తాయి. సమస్యను ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా. రవాణా సౌకర్యాన్ని మెరుగు పరిచి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– బాలకృష్ణ, కమిషనర్ ఆదిబట్ల

ఊర్లో ఉండాలా? వద్దా?

- పందుల బెడద తట్టుకోలేకపోతున్నాం
- ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి.. అదిలిస్తే దాడి చేస్తున్నాయి
- నందివనపర్తి గ్రామస్తుల ఆవేదన

యాచారం: 'పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి ఆగమాగం చేస్తున్నాయి. సామగ్రిని చిందరవందర చేస్తున్నాయి. అదిలిస్తే దాడులకు పాల్పడుతున్నాయి. తీవ్రంగా గాయపరుస్తున్నాయి. అసలు మేము ఊర్లో ఉండాలా? వద్దా' అని నందివనపర్తి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు వెయ్యికి పైగా పందులు సంచరిస్తున్నాయి. నివాసాలతో పాటు, ప్రభుత్వ పాఠశాల, సాంఘిక సంక్షేమ వసతి గృహంలోకి దూరుతున్నాయి. ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. ఇటీవల కొండాపురం మల్లేశ్ అనే వ్యక్తి ఇంట్లో చొరబడి.. అతని కుమార్తె వేదశ్రీతో పాటు మరికొందరిపై దాడిచేసి గాయపర్చాయి.

పట్టించుకోని అధికారులు

పందుల బెడద తట్టుకోలేక పోతున్నామని పేర్కొంటూ కలెక్టర్, డీపీఓ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశామని, అయినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. వాటి పెంపకం దారులపై పోలీసులతో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనికి స్పందించిన కార్యదర్శి.. తొలుత వాటి యజమానులకు పందులను తరలించాలని నెల రోజుల పాటు గడువు ఇచ్చారు. అయినా స్పందన కానరాకపోవడంతో గురువారం పంచాయతీ సిబ్బందితో 40 పందులను దూరప్రాంతాలకు తరలించారు. ఈ సమయంలో పందుల యజమానులు.. పంచాయతీ సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. ఫిర్యాదు మేరకు పోలీసులు గ్రామానికి వచ్చారు. పందులు ఇళ్ల మధ్యకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినా, స్పందన లేకపోవడంతోనే పంచాయతీ సిబ్బంది వాటిని దూరప్రాంతాలకు తరలిస్తున్నారని పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా పందులను నివాసాల మధ్యలోకి రాకుండా చూసుకుంటామని హామీ ఇస్తే.. వాటిని వదిలేస్తామని యజమానులకు చెప్పారు.



పందులను తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఎంపీహెచ్ఈఓకు సన్మానం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంపీహెచ్ఈఓగా పనిచేస్తున్న తిరుపతి రెడ్డిని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.వెంకటేశ్వర్‌రావ్ ఘనంగా సన్మానించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన తిరుపతి రెడ్డితో పాటు తలకొండపల్లి ఎంపీహెచ్ఏ విజయలక్ష్మికి నగరంలోని కామినేని ఆస్పత్రి ఆడిటోరియంలో గురువారం జరిగిన కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ ప్రశంసాపత్రం, అవార్డులు అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డా.గీత, జిల్లా అధికారులు షఫీ, శ్రీనివాస్, అక్రం, పూనం తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిరెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న వైద్యాధికారి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తలకొండపల్లి, చీపునుంతల, కడ్తాల్, చల్లంపల్లి గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం బాధితులకు అందజేశారు.

బడి పిల్లలకో బస్సు



బస్సును ప్రారంభించిన అధికారులు. చిత్రంలో విద్యార్థులు తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాలతో ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. గురువారం బస్సును ప్రారంభించారు. మెటిల్లా నుంచి ఎల్మినేడుకు ఉదయం, సాయంత్రం వెళల్లో ఈ బస్సును తిప్పనున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

ఎమ్మెల్యే సబితారెడ్డి

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆలయ ఉత్సవాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడారు. శ్రావణ మాసంలో ఆలయ వార్షికోత్సవాలు (బోనాలు) ఏటా ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు తగిన ఏర్పాట్లను అధికారులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా రావిర్యాల నుంచి ఆలయం వరకు రూ.4కోట్లతో బీటీ రోడ్డు, రూ.50 లక్షలతో సీసీరోడ్డు, రూ.30 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం, మంచి నీటి వసతి, విద్యుత్ లైట్లు ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామని పేర్కొన్నారు. త్వరలో పనులు ప్రారంభించి, పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి, ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, డీఈ యాదయ్య, ఏఈ గుణాకర్, కాశీనాథ్, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



జిల్లెలగూడ సాయినగర్ శ్మశానవాటిక దుస్థితి



లెనిన్‌నగర్ వైకుంఠ ధామం ముఖద్వారం

నిధులిచ్చి మూడేళ్లైనా..

- అభివృద్ధికి నోచుకోని శ్మశానవాటికలు
- కనీస సౌకర్యాలు కరువు

మీర్‌పేట: ఆత్మీయుల ఆఖరి మజిలీలో బంధుమిత్రులకు కష్టాలు తప్పడం లేదు. కడసారి చూపుకోసం వచ్చిన వారికి వైకుంఠ ధామంలో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. అపరిశుభ్రత వాతావరణంతో పాటు.. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు దర్శనం ఇవ్వడంతో ఇబ్బంది పడుతున్నారు. శ్మశానవాటికల అభివృద్ధికి మూడేళ్ల క్రితం నాటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. ఆ దిశగా చర్యలు చేపట్టినవారు లేరు. అంత్యక్రియల అనంతరం కుటుంబీకుల స్నానాలు ఆరుబయటే ఆచరించడం గమనార్హం.

నగరానికి చేరువన ఉన్నా..

మీర్‌పేట మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధి లెనిన్ నగర్, సిర్లాహిల్స్, సాయినగర్ శ్మశానవాటికల అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.1 కోటి చొప్పున నిధులు మంజూరు చేసింది. ఇందులో ఒక్క సిర్లాహిల్స్ శ్మశాన వాటికలో సంబంధిత అధికారులు అరకొర పనులతో మమా అనిపించారన్న ఆరోపణలు ఉన్నాయి. మారుమూల గ్రామాల్లో సైతం వైకుంఠ ధామాల పేరిట శ్మశాన వాటికలు ఎంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దబడ్డాయని, కానీ మహానగరానికి చేరువన ఉన్న మీర్‌పేట శ్మశాన వాటికల దుస్థితి దయనీయంగా మారిందని పురపాలిక ప్రజలు పేర్కొంటున్నారు. అపరిశుభ్రతతో పాటు సౌకర్యాలు లేవని తెలిపారు. అంత్యక్రియల కోసం వచ్చే వారికి గదులు లేకపోవడంతో.. ఆరుబయటే స్నానాలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. జిల్లెలగూడ సాయినగర్ శ్మశాన వాటిక వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉందని, పరదాలు కట్టి స్నానాలు చేయాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి, శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలని కోరుతున్నారు.

అర్హులందరికీ ఇళ్లు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందని తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి చంద్రాయణపల్లి తండాలో లబ్ధిదారు నిర్మిస్తున్న ఇంటిని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో పేదలకు ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ప్రభుత్వం కల్వకుర్తికి అదనంగా మరో వెయ్యి ఇళ్లు మంజూరు చేయనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాగ్యనాయక్, శ్రీనునాయక్, గోపాల్‌నాయక్, శంకర్‌నాయక్, హర్యనాయక్, సాగర్, రమేశ్, కృష్ణ, బన్సీలాల్, జైపాల్, గుబ్రియా తదితరులు పాల్గొన్నారు.

బీసీసేన గ్రామ కమిటీ ఎన్నిక

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లలో బీసీసేన మండల అధ్యక్షుడు బోయ చెన్నయ్య ఆధ్వర్యంలో గురువారం బీసీసేన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కార్తిక్‌ను నియమించారు.

విద్యార్థుల చేతుల్లో దేశ భవిష్యత్తు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ నేత ఇస్నాతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్స్, టై, బెల్టులు, షూ అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్న నాటి నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని, లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపీనాథ్, పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ స్వాతి, నాయకులు ఇస్నాతి గంగాధర్, మోహన్‌సింగ్, సుధాకర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాజునాయక్, ప్రశాంత్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న విష్ణు

పనితీరు చాలా బాగుంది

ఇబ్రహీంపట్నం రూరల్: ఠాణాలో రిసెప్షన్ మేనేజ్‌మెంట్ పనితీరు బాగుందని ఏసీపీ కేపీవీ రాజు కితాబు ఇచ్చారు. గురువారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదు దారులతో ఎలా వ్యవహరిస్తున్నారు, వారికి రిషిట్లు ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు చేసిన వాటిని కేసులుగా నమోదు చేస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. అనంతరం ప్రమీదా గార్డెన్ వద్ద వాహనాల సోదాను సీఐ రాఘవేందర్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేశ్, సత్యనారాయణ, నోయల్‌రాజు, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ రాజు. చిత్రంలో సీఐ రాఘవేందర్‌రెడ్డి

గజ ఈతగాడికి సన్మానం

కడ్తాల్: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి మృతి చెందగా.. ధైర్యసాహసాలతో మృత దేహాన్ని వెలికి తీసిన వ్యక్తిని పోలీసులు సన్మానించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం శివారులోని కానుగులకుంట చెరువులో ఉట్లపల్లి గ్రామానికి చెందిన దొంతుల అంజయ్య బుధవారం సాయంత్రం చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అతను నీట మునిగి మృత్యువాత పడ్డాడు. ఎస్ఐ వరప్రసాద్ ప్రోత్సాహంతో గురువారం గజ ఈతగాడు యాదయ్య.. చెరువులో నుంచి అంజయ్య మృతదేహాన్ని బయటకు తీశాడు. ఈ సందర్భంగా యాదయ్యను.. సీఐ గంగాధర్, ఎస్ఐ వరప్రసాద్‌లు అభినందించి సన్మానించారు. నగదు బహుమతిని అందజేశారు.



యాదయ్యను సన్మానిస్తున్న సీఐ, ఎస్ఐలు

జంక్షన్.. టెన్షన్

- డేంజర్‌గా రావిర్యాల ఔటర్ కూడలి
- తరచూ ప్రమాదాలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు



రావిర్యాల ఔటర్ జంక్షన్

తుక్కుగూడ: రావిర్యాల నెహ్రూ ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్– 13 జంక్షన్ డేంజర్‌గా మారింది. ప్రమాదాలకు కేంద్రంగా మారి రక్తసిక్తం అవుతోంది. ప్రయాణికులు, వాహనదారులను భయాందోళనకు గురిచేస్తోంది. ఈ కూడలి.. కలెక్టరేట్, కొంగర్‌కలాన్, రావిర్యాల నుంచి పహాడీషరీఫ్ మీదుగా నగరానికి మన్నెగూడ (నాగార్జున సాగర్ హైవే) హార్డ్‌వేర్ పార్క్, ఈ– సిటీ, పర్యాటక కేంద్రం వండర్‌లా, రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం తదితర ప్రాంతాలకు వెళ్లేవారికి అనుసంధానంగా ఉంది. కొంగరకలాన్‌లో ఫ్యాక్స్‌కాన్‌తో పాటు, అనేక నూతన పరిశ్రమలు కొలువుదీరడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

కొరవడిన పర్యవేక్షణ

ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ విశాలంగా ఉంటుంది. కానీ సూచిక బోర్డులు లేక పోవడంతో వాహనాలు ఇష్టారాజ్యంగా పరుగులు తీస్తుంటాయి. ప్రతి మంగళవారం ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులు, వండర్‌లాకు వచ్చే పర్యాటకులు, కలెక్టర్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చి వెళ్లేవారితో కూడలి రద్దీగా ఉంటుంది. ఇంత వరకు బాగానే ఉన్నా.. కూడలిలో వేగ నియంత్రణ, కొరవడిన ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ వెరసి నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంటుంది. ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు నెలల క్రితం టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు, మరో ఘటనలో ఓ పాదచారుడు దుర్మరణం పాలయ్యారు. ఇటీవల ఆర్ఎంసీ కాంక్రీట్ వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్రగా గాయపడడంతో పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలతో నెత్తురోడుతున్న రోడ్డును చూసి భయాందోళన చెందుతున్నారు. జంక్షన్‌లో వేగ నియంత్రణ చేపట్టాలని, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు.. ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగించి, ప్రమాదాలకు అడ్డుకట్టవేయాలని కోరుతున్నారు.

దొంగలుంటారు జాగ్రత్త

ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

యాచారం: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు మహిళలు.. అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ప్రయాణికులకు సూచించారు. గురువారం యాచారం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులతో ఆయన మాట్లాడారు. బస్సుల్లో దొంగలుంటారని, ఆభరణాలను ధరించినవారు అజాగ్రత్తగా ఉండరాదన్నారు. విలువైన వస్తువులు వెంట తీసుకెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇంట్లో విలువైన వస్తువులను ఉంచరాదన్నారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు బిగించుకోవాలని సూచించారు. సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్ఐ మధు ఉన్నారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు